క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



పనులు పరిశీలిస్తున్న ఏపీవో

వీర్నపల్లి: మండల కేంద్రంలోని బీరప్ప ఏరియా ప్రాంతంలో జరుగుతున్న జాతీయ ఉపాధిహామీ పథకం పనులను సోమవారం ఏపీవో శ్రీహరి పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనిని కూలీలు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. కూలీల మస్టర్‌ను పరిశీలించారు. అసిస్టెంట్ రాజు, సీనియర్ మేట్ రాధరాపు లింబాద్రి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలంలోని ఎస్సీ గురుకుల కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 31 లోపు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, ఫీజు రూ.100 చెల్లించాలని సూచించారు.

పరామర్శ

కోనరావుపేట: సుద్దాల గ్రామ మాజీ సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి–శంకర్‌ను పలువురు నాయకులు పరామర్శించారు. శంకర్ తల్లి ఉప్పుల అనుమవ్వ మృతిచెందగా.. అంత్యక్రియల్లో పాల్గొని వారి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ చంద్రయ్య, సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, రాఘవరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్యయాదవ్, ఎంపీటీసీ కాశవేని మమత–మహేశ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్, కచ్చకాయల మహేశ్, సుమన్, ఆంజనేయులు, సంజీవ్, శ్రీధర్ తదితరులు ఓదార్చారు.

రక్తదానం చేసిన యువకుడు



ఎల్లారెడ్డిపేట: అత్యవసర పరిస్థితుల్లో ఓ పేషెంట్‌కు ఎల్లారెడ్డిపేటకు చెందిన బీపేట రాజుయాదవ్ రక్తదానం చేశారు. యువకుడిని తాజా మాజీ ఉప సర్పంచ్ దంపతులు ఒగ్గు రజిత, బాలరాజు అభినందించారు.

వృద్ధుల డే కేర్ సెంటర్‌లో పెళ్లి రోజు వేడుకలు



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో రిటైర్డ్ ఉపాధ్యాయులు దొడ్ల క్రిష్ణయ్య–చంద్రకళ దంపతులు తమ 61వ వార్షిక వేడుకలు నిర్వహించుకున్నారు. వృద్ధులకు భోజనం ఏర్పాటు చేసి పండ్లు, కేక్ అందించారు. కుటుంబ సభ్యులు సంజీవ్, వాణిశ్రీ ఉన్నారు.

కానిస్టేబుల్‌కు అభినందన



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎస్పీ అఖిల్

సిరిసిల్లక్రైం: గుండెపోటుకు గురైన మహిళకు సకాలంలో సీపీఆర్ విధానంతో ప్రాణాలు కాపాడిన తంగళ్లపల్లి కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రశంస పత్రాన్ని అందించారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అనూహ్య అనే వివాహిత వాళ్ల నాన్న మరణ వార్త విని రెండు రోజుల క్రితం గుండెపోటుకు గురైంది. ఇదే సమయంలో అందుబాటులో ఉన్న కానిస్టేబుల్ శ్రీనివాస్ సకాలంలో ప్రథమ చికిత్స అందించారు. వెంటనే సంబంధిత మహిళను ఆసుపత్రికి తరలించగా.. ప్రాణాలు దక్కాయి. ఆర్ఐ మధుకర్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాజేందర్

ముస్తాబాద్: ముస్తాబాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాజేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గంభీరావుపేట ఎంపీడీవోగా పని చేస్తున్న రాజేందర్‌కు ముస్తాబాద్ అదనపు బాధ్యతలిచ్చారు. ఇక్కడి ఎంపీడీవో భాస్కర శర్మ అనారోగ్యంతో సెలవులో ఉన్నారు. పోతుగల్ ప్రత్యేకాధికారితోపాటు ఎంపీడీవోగా రాజేందర్ పని చేయనున్నారు.

పర్యవేక్షణ లేని పనులు

- అస్తవ్యస్తంగా మూలవాగు ప్రాజెక్ట్ పనులు
- కట్ట పనుల్లో నాణ్యతా లోపం



వరుస లేకుండా నిర్మించిన గార్డ్ స్టోన్లు



నిమ్మపల్లి కట్టకు అనుమతి లేకుండా తవ్విన రెవెన్యూ గుట్ట

కోనరావుపేట: నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్ట్ అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్ట్ 9 ప్యాకేజీలో భాగంగా రూ.163కోట్లతో నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయి. మల్కపేట రిజర్వాయర్ నుంచి నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్‌కు నీటిని పంపింగ్ చేయాలి. ఈ పనుల్లో భాగంగా కట్ట సుందరీకరణ, కట్ట వెడల్పు పనులు జరుగుతున్నాయి. అయితే పనులు చేస్తున్న కాంట్రాక్టర్ అక్కడే గుట్టపై ఉన్న మట్టిని తవ్వుతూ కట్టకు పోస్తున్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొద్ది రోజులకే శిథిలం

నిమ్మపల్లిలో కట్ట వెడల్పు పనులు చేస్తున్నారు. కట్టపై మట్టిని పోసి పక్కలకు సిమెంట్ దిమ్మె(గార్డ్ స్టోన్)లను ఏర్పాటు చేశారు. అయితే నాణ్యత లేకపోవడంతో ఇప్పుడే పక్కకు వంగుతున్నాయి. కట్ట పొడవునా నిర్మించిన దిమ్మెలను ఒక వరుసలో ఏర్పాటు చేయకుండా ఎక్కువ తక్కువగా ఉన్నాయి. పనుల్లో నాణ్యత లేకపోవడంతో అవి కొద్ది రోజులకే శిథిలమవుతున్నాయి. ఎడమ కాలువ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించడంతో కాలువలో పగుళ్లు ఏర్పడుతున్నాయి. పది కాలాలపాటు మన్నాల్సిన పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైందని ఆరోపిస్తున్నారు.

అక్రమ తవ్వకాలు..

నిమ్మపల్లి ప్రాజెక్ట్ కట్టను బలోపేతం చేసేందుకు కట్టకు మట్టిని పోశారు. అయితే ఈ మట్టిని వేరే ప్రాంతం నుంచి తేవాల్సి ఉండగా.. ప్రాజెక్ కట్ట పక్కనే ఉన్న రెవెన్యూ గుట్ట మట్టిని తవ్వారు. ఇందుకోసం తాము ఎలాంటి అనుమతులివ్వలేదని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. మట్టిని తవ్విన గుట్టతో ప్రాజెక్టకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నిమ్మపల్లిలోని మూలవాగు ప్రాజెక్ట్ వద్ద చేస్తున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు. కాలువ పనులు కొంతమేర చేయగా.. చేసిన పనులు కూడా సంతృప్తికరంగా కనిపించడం లేదు. కాలువలో పాత పైపులతో పనులు చేశారు. ఈ పనులను సంబంధిత అధికారులు పర్యవేక్షించి నాణ్యతతో జరిగేలా చూడాలని కోరుతున్నాం. – దప్పుల జైశేఖర్, నిమ్మపల్లి

అన్ని పనులు చేయిస్తున్నాం

నిమ్మపల్లి ప్రాజెక్ట్ కట్ట అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కట్టపై వెడల్పు ఇదివరకు కేవలం 3 మీటర్లు మాత్రమే ఉండడంతో 6 మీటర్లకు పెంచి పనులు చేయించాం. గార్డ్ స్టోన్ పనులు వంకరటింకరగా ఉండడంతో వాటిని మళ్లీ చేయాలని ఆదేశించా. మూలవాగు ప్రాజెక్ట్ కట్ట అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– భూమరాజ్, ఏఈ

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి



వేములవాడఅర్బన్: మాట్లాడుతున్న ఏఈవో

వేములవాడఅర్బన్: అనుపురం, రుద్రవరం గ్రామాల్లో మండల ఏఈవో అనూష వానాకాలంలో రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. జెడ్పీటీసీ మ్యాకల రవి, మాజీ సర్పంచులు వెంకటరమణరావు, రాంరెడ్డి, వంకాయల భూమయ్య, మెడికల్ రాజిరెడ్డి, కనకయ్య తదితరులున్నారు.

బోయినపల్లి: వానాకాలంలో వివిధ రకాల పంటలు సాగు చేసే రైతులు లైసెన్స్ కలిగి ఉన్న విత్తన దుకాణాల్లోనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని ఎంఏవో ప్రణీత సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సోమవారం రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మండలంలోని నాలుగు రైతువేదిక క్లస్టర్ల పరిధిలో 165 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏఈవో శ్రీదేవి ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ఏవో

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి సురేష్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ దృష్టిలో పెట్టుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు



ఆవునూర్‌లో పనులు పరిశీలిస్తున్న సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, అధికారులు

ముస్తాబాద్: భారీ ఈదురుగాలులకు మండలంలోని పలు గ్రామాల్లో సెస్‌కు భారీగానే నష్టం జరిగిందని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. ముస్తాబాద్, పోతుగల్, గూడెం, కొండాపూర్, ఆవునూర్ గ్రామాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్ల పనులను సోమవారం పరిశీలించారు. అంజిరెడ్డి మాట్లాడుతూ.. మండలంలో 90కి పైగా విద్యుత్ పోల్స్ పడిపోయాయని, లైన్లకు తీవ్ర విఘాతం జరిగిందన్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించిన పోల్స్ బాగా విరిగిపోయాయని అన్నారు. వీటన్నింటిని బాగు చేస్తూ వాటి స్థానంలో కొత్త పోల్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇక గృహ విద్యుత్‌కు ఎక్కడ ఇబ్బంది కలగకుండా సెస్ అధికారులు, సిబ్బంది పని చేశారని అన్నారు. ఏఈ విష్ణుతేజ, లైన్‌మెన్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

లీకేజీ మరమ్మతులపై నిర్లక్ష్యం



చందుర్తి: మండల కేంద్రంలోని పంచాయతీకి కూతవేటు దూరంలో ఉన్న మంచినీటి గేట్‌వాల్స్‌కు ఏడాది కాలంగా లీకేజీలున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నెల రోజుల క్రితం మంచినీటి ఎద్దడి వస్తుందన్న ముందుచూపుతో జిల్లా ఉన్నతాధికారులు లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని పకడ్బందీగా ఆదేశాలు జారీ చేసినా.. వాటిని అమలుపరచడంలో కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. రానుంది వర్షాకాలం కావడంతో లీకేజీ గేట్‌వాల్స్‌తో రోగాల బారిన పడే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శిలాఫలకానికే పరిమితం



తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదిక సమీపంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 2022 ఏప్రిల్ 14న అప్పటి మంత్రి కేటీఆర్ రూ.50లక్షల అంచనా వ్యయంతో శిలాఫలకం ప్రారంభించారు. ఇప్పటికే రెండేళ్లు గడిచినా నిర్మాణ పనులు చేపట్టడం లేదని దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం



గంభీరావుపేట: నర్మాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యావలంటీర్‌గా పని చేసిన కర్రొల్ల రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తనతో పని చేసిన తోటి ఉపాధ్యాయులు సోమవారం తలా కొంత పోగు చేసి రాజు కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. హాజునాయక్, చంద్రకళ, శోభ, విజయశేఖర్, పర్శరాములు, ఆంజనేయులు, ప్రకాశ్, శంకర్, మధవి, మహేశ్, నీలకంఠం, అఖిల్‌నాయక్, రామస్వామి పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌ను కలిసిన నాయకులు



ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్ నాయకులు సోమవారం కలిశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, పాతూరి బాల్‌రెడ్డి ఉన్నారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు.

విప్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిపేట: మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిశారు. విదేశీ ప్రయాణం చేసి వచ్చిన విప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, లింగంగౌడ్, షేక్‌గౌస్, బానోత్ రాజు, రాజేందర్, బుచ్చాగౌడ్, రాంరెడ్డి, ఇమామ్, బాలయ్య, రాములు, సత్యనారాయణ ఉన్నారు.

కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నాయకులు



ఎల్లారెడ్డిపేట: గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం సిరిసిల్ల కోర్టుకు హాజరయ్యారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు లింగంగౌడ్, షేక్‌గౌస్, బానోత్ రాజు, రాజేందర్, బుచ్చాగౌడ్, రాంరెడ్డి, ఇమామ్, బాలయ్య, రాములు, సత్యనారాయణ ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కళాశాల ప్రత్యేకతలను వివరిస్తూ కళాశాలలో చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాసరవేని పర్శరాములు, చంద్రమౌళి, కవిత, విష్ణుప్రసాద్, సాగర్, ప్రవళిక, గౌతమి పాల్గొన్నారు.

చందుర్తి(వేములవాడ): ప్రైవేట్ కళాశాలలకు తీసిపోని విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాబోధన చేస్తున్నామంటూ కళాశాల అధ్యాపక బృందం సోమవారం పల్లెబాట పట్టారు. చందుర్తి మండలం నర్సింగపూర్, మల్యాల గ్రామాల్లో పదోతరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఇంటర్ విద్యార్థులు సాధించిన మార్కుల వివరాలు, వారి ఫొటోలను చూపించారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవం, అర్హత కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన చేస్తామని, విద్యార్థులకు ఉచిత ప్రవేశాలతోపాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందజేస్తుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కళాశాల అధ్యాపక బృందం వివరించింది. మాడ్గుల కృష్ణాకర్, దొడ్డ రమేశ్‌బాబు, గొంటికార్ సుమన్, దండు రమేశ్, నాగబోయిన సంజీవయ్య, పయ్యావుల తిరుపతి, మీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి



బహుమతి అందిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

కోనరావుపేట: యువకులు క్రీడల్లో రాణించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. కోనరావుపేటలో దోస్తీ మీట్ 2024 కార్యక్రమంలో భాగంగా వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. కానిస్టేబుల్ విశాల్ రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమాజానికి మార్గదర్శకులు కావాలి

ముస్తాబాద్: యువత ఉన్నత లక్ష్యం చేరుకొని సమాజానికి మార్గదర్శకులు కావాలని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. దోస్తీ మీట్–2024లో భాగంగా నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. కబడ్డీ, వాలీబాల్ విజేతలకు డాక్టర్ చింతోజు శంకర్ రూ.30వేల నగదును సొంతంగా అందజేశారు. సీఐ మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు బానిస కావొద్దని సూచించారు. డాక్టర్ చింతోజు శంకర్ మాట్లాడుతూ.. గ్రామీణ యువత తల్లిదండ్రులు, ఊరు గర్వపడేలా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, పీడీ లక్ష్మినారాయణ, పీఈటీలు, పోలీస్ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

రుద్రంగి: ఆటల పోటీల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న దోస్తీ మీట్ చివరి రోజు క్రీడాపోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కబడ్డీ ఫైనల్‌లో బడితండా, గైదిగుట్టతండా గ్రామాలు పోటీ పడగా.. బడితండా గెలిచింది. వాలీబాల్ ఫైనల్‌లో రుద్రంగి స్పోర్ట్స్ క్లబ్, బడితండా గ్రామాలు పోటీ పడగా.. రుద్రంగి స్పోర్ట్స్ క్లబ్ విజయం సాధించింది. సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ బహుమతులు అందజేశారు.

నిధుల్లేక ‘అడవిపదిర’లో గొడవలు

వీర్నపల్లి: అడవిపదిర పంచాయతీలో సోమవారం మల్టీపర్పస్ వర్కర్, కార్యదర్శి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. గ్రామస్తులు వివరాల ప్రకారం.. మల్టీపర్పస్ వర్కర్ 10 నెలల వేతనం రావాలని సదరు కార్యదర్శి మీదకు గొడవకు దిగగా.. నీకు రావాల్సింది 6నెలల వేతనమే అని కార్యదర్శి అనడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీనికి మద్దతుగా మండలంలో మల్టీపర్పస్ వర్కర్లు ధర్నా చేస్తామని ఆలోచన చేయగా.. ఎలక్షన్ కోడ్ ఉంది, ధర్నా చేయడానికి అవకాశం లేదని ఎస్సై రమేశ్ తేల్చి చెప్పారు. ఎన్నికల కోడ్‌తో గ్రామంలో అభివృద్ధితోపాటు మల్టీపర్పస్ వర్కర్లు, కార్యదర్శులకు వేతనాల విషయంలో ఇబ్బందులు నెలకొంటున్నాయి. 5మాసాలుగా పంచాయతీల అభివృద్ధి విషయంలో కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యేక అధికారులు గ్రామాలను పట్టించుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని ప్రజలంటున్నారు.

వెలగని దీపాలు



బోయినపల్లి(చొప్పదండి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతమైన అంబేద్కర్ చౌరస్తాలో ఫ్లడ్‌లైట్లు వెలగడం లేదు. దీంతో అంబేద్కర్ చౌరస్తా పరిసరాల్లో రాత్రి అంధకారం నెలకొంటోంది. కొద్ది రోజులుగా తరచూ ఫ్లడ్‌లైట్లు వెలగకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం



హన్మాజిపేటలో రోడ్డు పక్కనే నిలిచిన మురుగు నీరు

వేములవాడరూరల్: సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. వివిధ హోదాల్లో ఉన్న అధికారులకు అదనంగా ఈ బాధ్యతలను అప్పగించడంతో వారు గ్రామాలకు సమయాన్ని కేటాయించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది కార్యదర్శులకు ఈ బాధ్యతలను అప్పగించడంతో.. వారు కూడా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, మండల అధికారులు, కార్యదర్శులకు ప్రధానంగా ఈ ప్రత్యేక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. కానీ చాలామంది అధికారులు ఇప్పటివరకు గ్రామాలకు పోయిన దాఖలాలు లేవని వారు ఆరోపిస్తున్నారు. నీటి సమస్య, విద్యుత్, డ్రైనేజీ తదితర సమస్యలు గ్రామాల్లో పేరుకుపోతున్నాయని, సర్పంచుల పదవీకాలం ముగియడంతో వారు కూడా దృష్టి సారించడం లేదని పలువురు అంటున్నారు. గ్రామ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియక చాలామంది ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు సమస్యలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

వేములవాడ: మండుతున్న ఎండల దృష్ట్యా సోమవారం ఈవో రామకృష్ణ భక్తులకు మజ్జిగ పొట్లాలను పంపిణీ చేశారు. క్యూలైన్ల నుంచి ఆలయంలోకి చేరుకుంటున్న భక్తులు, ఉపవాస దీక్షలో ఉన్న భక్తులకు అందజేశారు.